సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

శనివారం । 30 । మార్చి । 2024



టన్ను చీనీ రూ.27 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.27 వేలు, కనిష్టంగా రూ.12 వేలు, సరాసరిన రూ.18 వేల ప్రకారం పలికాయి.



కిలో టమాట రూ.13

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్టంగా రూ.13 పలికింది. మార్కెట్‌కు 170 టన్నుల సరుకు అమ్మకానికి వచ్చింది.

రంజాన్ వేళలు

శనివారం	ఆదివారం
సాయంత్రం	ఉదయం
ఇఫ్తార్ : 6.35	సెహరీ : 5.02



న్యూస్‌రీల్

ఖాద్రీశుని సేవలో డీఐజీ అమ్మిరెడ్డి



ఖాద్రీశుని ఆలయంలో డీఐజీ అమ్మిరెడ్డి, ఎస్పీ మాధవరెడ్డి

కదిరి టౌన్: అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి శుక్రవారం ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి సేవలో గడిపారు. జిల్లా ఎస్పీ మాధవరెడ్డితో కలిసి ఆలయానికి విచ్చేసిన ఆయనకు అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఖాద్రీశునికి డీఐజీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఆలయ విశిష్టతను వివరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ ఈఓ వి.శ్రీనివాసరెడ్డి డీఐజీకి శ్రీవారి చిత్ర పటాన్ని బహూకరించారు. డీఐజీ వెంట కదిరి డీఎస్పీ శ్రీలత, పలువురు సీఐలు ఉన్నారు.

క్వింటా ఎండుమిర్చి రూ.20 వేలు



'పురం' మార్కెట్‌కు వచ్చిన ఎండు మిర్చి

హిందూపురం అర్బన్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం క్వింటా ఎండుమిర్చి రూ. 20 వేలు పలికింది. మార్కెట్‌కు 54 క్వింటాళ్ల సరుకు రాగా, అధికారులు ఈ- నామ్ పద్ధతిలో వేలం వేశారు. ఇందులో మొదటి రకం క్వింటా రూ. 20 వేలు, రెండో రకం రూ.10 వేలు, మూడో రకం క్వింటా ఎండుమిర్చి రూ.6 వేల ప్రకారం క్రయవిక్రయాలు సాగినట్లు మార్కెట్ కార్యదర్శి జి. చంద్రమౌళి తెలిపారు.

తాగునీటి సమస్య లేకుండా చూడండి

- అధికారులకు కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

కదిరి టౌన్: వేసవిలో ఎక్కడా తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. శుక్రవారం కదిరికి విచ్చేసిన కలెక్టర్ స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో అధికారులతో తాగునీటి సమస్య నివారణ, ఉపాధి హామీ పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... కదిరి డివిజన్ పరిధిలో తాగునీటి సమస్య ఉత్పన్నమయ్యే గ్రామాలను ముందస్తుగా గుర్తించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. విధుల్లో ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదన్నారు. అలాగే వేసవిలో ఉపాధి హామీ కూలీలకు ఇబ్బందులు కలగకుండా పని ప్రదేశాల్లో సౌకర్యాలు కల్పించాలన్నారు. ఏప్రిల్ 1వ తేదీ నుంచి రోజువారీ కూలి రూ.300కు పెరిగిన విషయాన్నీ కూలీలకు వివరించాలన్నారు. సమావేశంలో ఆర్డీఓ వంశీకృష్ణ, మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ వెంకటనారాయణ, డ్వామా పీడీ విజయప్రసాద్, అన్ని మండలాల ఎంపీడీఓలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.



మేమంతా సిద్ధం

- నేడు జిల్లాలో సీఎం జగన్ బస్సు యాత్ర
- స్వాగతం పలికేందుకు వైఎస్సార్‌సీపీ శ్రేణుల సమాయత్తం
- రాప్తాడులో సిద్ధం సభ అనంతరం మళ్లీ జిల్లాలోకి జననేత
- పలు ప్రాంతాల్లో రోడ్ షో
- రాత్రి బత్తలపల్లి మండలం సంజీవపురం శివారులో బస

సాక్షి ప్రతినిధి, అనంతపురం: భగభగ మండుతోన్న ఎండలు.. నిప్పుల వాన కురిసినట్టుగా వాతావరణం.. అయితేనేం తమ అభిమాన నేత జిల్లాలోకి వస్తే ఇవన్నీ మాకో లెక్కా అంటున్నాయి పార్టీ శ్రేణులు. 'మేమంతా సిద్ధం' బస్సు యాత్రలో భాగంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం కర్నూలు జిల్లా నుంచి గుత్తిలోకి అడుగు పెట్టనున్నారు. ఇప్పటికే వైఎస్సార్, కర్నూలు జిల్లాల్లో జరిగిన బస్సుయాత్రలో ప్రజలు జగన్‌కు బ్రహ్మరథం పట్టిన విషయం తెలిసిందే. అంతకు మించి అనంతపురం జిల్లాలో అపూర్వ స్వాగతం పలకాలని పార్టీ శ్రేణులు ఉవ్విళ్లూరుతున్నాయి. ఆయన రాక కోసం లక్షలాది మంది అభిమానులు, పార్టీ కార్యకర్తలు, ప్రజలు ఎదురు చూస్తున్నారు.

40 రోజుల్లోనే మళ్లీ జిల్లాకు..

రాప్తాడులో ఫిబ్రవరి 18న చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో 'సిద్ధం' సభ జరిగింది. లక్షలాదిమంది ప్రజలు జగన్ సందేశాన్ని వినడానికి తరలివచ్చారు. సరిగ్గా సభ జరిగిన 40 రోజుల్లోనే జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ జిల్లాకు వస్తున్నారు. అంతేకాదు ముఖ్యమంత్రి హోదాలో వివిధ ప్రభుత్వ పథకాల నిధుల విడుదలకు రాయదుర్గం, పుట్టపర్తి, రాప్తాడు, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాలకు వచ్చారు. ఆయా సభలకు సైతం అశేష జనవాహిని తరలి వచ్చింది. అదే తరహాలో శనివారం జరిగే బస్సు యాత్రకు జిల్లా నలుమూలల నుంచి జనం తరలి రానున్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

సంజీవపురం శివారులో రాత్రి బస

బస్సు యాత్రలో భాగంగా వైఎస్ జగన్ శనివారం అనంతపురం జిల్లాలోకి ప్రవేశించి గుత్తి, పామిడి, గార్లదిన్నె, అనంతపురం, రాప్తాడు, ఎస్కేయూ మీదుగా రోడ్ షో నిర్వహిస్తారు. శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలం సంజీవపురం శివారు వరకు బస్సు యాత్ర కొనసాగుతుంది. ఆ రాత్రి సంజీవపురం శివారులో సీఎం జగన్ బస చేయనున్నారు. 31వ తేదీ యాత్రకు విరామం ఇవ్వగా.. ఏప్రిల్ 1న యాత్ర పునః ప్రారంభమై శ్రీసత్యసాయి జిల్లాలో కొనసాగుతుంది. ఏప్రిల్ ఒకటో తేదీన కదిరిలో ముస్లిం మైనార్టీలు ఇచ్చే ఇఫ్తార్ విందులో పాల్గొననున్నారు. ముఖ్యమంత్రి బస్సు యాత్ర సందర్భంగా పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేసినట్టు ఎస్పీ అన్బురాజన్ తెలిపారు. ఎక్కడా అవాంఛనీయ ఘటనలు జరగకుండా భద్రత కల్పించినట్టు చెప్పారు.

బస్సు యాత్ర రూట్ పరిశీలన

గుత్తి: కర్నూలు జిల్లా తుగ్గలి మండలం జొన్నగిరి నుంచి గుత్తి మండలం బసినేపల్లి, గుత్తి ఆర్‌ఎస్, గుత్తి ప్రాంతాల్లో జరుగనున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బస్సుయాత్ర రూట్లను ఎస్పీ అన్బురాజన్ శుక్రవారం పరిశీలించారు. భద్రతా ఏర్పాట్లపై పోలీసులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో గుంతకల్లు డీఎస్పీ శివభాస్కర్‌రెడ్డి, పామిడి సీఐ రాజశేఖర్‌రెడ్డి, ఎస్‌ఐ నబిరసూల్ పాల్గొన్నారు.

సీఎం జగన్ బసకు ఏర్పాట్లు

బత్తలపల్లి: ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'మేమంతా సిద్ధం' పేరుతో నిర్వహిస్తున్న బస్సుయాత్ర శనివారం రాత్రి బత్తలపల్లి మండలానికి చేరుకోనుంది. దీంతో స్థానిక వైఎస్సార్ సీపీ నేతలు సీఎం జగన్ బస చేసేందుకు మండలంలోని సంజీవపురం సమీపంలో విడిది కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. శుక్రవారం కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్‌బాబు, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కమతం ఈశ్వరయ్య, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ మాదిరెడ్డి జయరామిరెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ రాంభూపాల్‌రెడ్డి, మాజీ కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. సంజీవపురం వద్ద ఏర్పాటు చేస్తున్న విడిది కేంద్రంలో శనివారం రాత్రి, ఆదివారం రాత్రి సీఎం వైఎస్ జగన్ బస చేయనున్నట్లు వైఎస్సార్ సీపీ నాయకులు తెలిపారు. ఏర్పాట్ల పర్యవేక్షణలో సచివాలయ కన్వీనర్ రాజవీరారెడ్డి, బండి వీరనారప్ప, బడన్నపల్లి సూర్యనారాయణరెడ్డి, మిడతల లక్ష్మీనారాయణ, ఉపేంద్రరెడ్డి, జేసీబీ రాఘవ, సంజీవపురం ఉప సర్పంచు నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.



సీఎం విడిది కేంద్రం ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

1న కదిరికి సీఎం వైఎస్ జగన్



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ కదిరి ఎమ్మెల్యే అభ్యర్థి బీఎస్ మక్బూల్ అహ్మద్

కదిరి: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఏప్రిల్ 1వ తేదీన కదిరిలో పర్యటించనున్నట్లు వైఎస్సార్ సీపీ కదిరి ఎమ్మెల్యే అభ్యర్థి బీఎస్ మక్బూల్ తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై సీఎం పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. శుక్రవారం ఆయన స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఏప్రిల్ 1న కదిరికి రానున్న సీఎం జగన్ సాయంత్రం 4 గంటలకు పట్టణంలో రోడ్‌షో నిర్వహించడంతో పాటు బహిరంగ సభలో ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారని వెల్లడించారు. అనంతరం స్థానిక పీవీఆర్ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొంటారన్నారు.

కందికుంటనే నాన్ లోకల్

టీడీపీ నాయకుడు కందికుంట వెంకట ప్రసాద్ తనను నాన్‌లోకల్ అని ఆరోపించారని, వాస్తవానికి ఆయనే నాన్‌లోకల్ అని మక్బూల్ పేర్కొన్నారు. తాను కదిరిలో పుట్టి, కదిరిలోనే చదువుకున్నానని తెలిపారు. పట్టణంలోని ప్రతి వీధిలో మిత్రులతో కలిసి ఆడుకున్నానని గుర్తు చేశారు. కానీ కందికుంట వాళ్ల నాన్న ఉద్యోగ రీత్యా కదిరికి వచ్చారని, అలాంటప్పుడు ఆయన లోకల్ ఎలా అవుతారని ప్రశ్నించారు. కదిరిలో ముచ్చటగా మూడోసారి వైఎస్సార్‌సీపీ జెండా ఎగరడం ఖాయమన్నారు. కందికుంటకు మరోసారి ఓటమి తప్పదన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వజ్ర భాస్కర్‌రెడ్డి, సీఈసీ సభ్యులు పూల శ్రీనివాసరెడ్డి, పార్టీ నియోజక వర్గ మాజీ సమన్వయకర్త ఎస్‌ఎండీ ఇస్మాయిల్, మున్సిపల్ వైస్ చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు జిలాన్, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.



ఐరావతంపై నృసింహుడి దర్శనం



ఆలయంలో పోటెత్తిన భక్త జనం

ఐరావతంపై కాటమరాయుడు

కదిరి: బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి లక్ష్మీనారసింహుడు ఐరావతంపై (గజవాహనం) దర్శనమిచ్చారు. హిరణ్య కస్యపుని సంహారం అనంతరం నారసింహుడి ఉగ్ర రూపాన్ని చూడలేని దేవతాగణం మరోసారి యథా రూపంలో ప్రసన్నం కావాలని కోరుతారు. దీంతో వారి కోరిక మేరకు స్వామి వారు ఐరావతంపై దర్శనమిచ్చారని భక్తుల నమ్మకం. ఈ ఉత్సవంలో పాల్గొనేందుకు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగున ఉన్న కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి సైతం భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేశారు. గజవాహన ఉభయదారులుగా పబ్బిశెట్టి రంగనాయకులు కుటుంబ సభ్యులు వ్యవహరించారని ఆలయ ఈఓ వి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. అంతకు ముందు అర్చకులు పూజలు చేసి కలశాన్ని శ్రీవారి బ్రహ్మ రథంపై ప్రతిష్ఠించారు. శుద్ధి పుణ్యాహవచనం, వాస్తు, రథాంగ హోమాలు, రథ సంప్రోక్షణ చేశారు. ఐరావతంపై ఊరేగిన అనంతరం శ్రీవారు ఆలయంలోకి వెళ్లి పూజల అనంతరం రథంపైకి చేరుకున్నారు. శ్రీదేవి, భూదేవిలను కంకణ భట్టాచార్యులు రథంపైకి తీసుకొచ్చారు.

జనంలోంచి వచ్చిన నాయకుడు జగన్

- బస్సుయాత్రకు ప్రజలు నీరాజనం
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు నవీన్‌నిశ్చల్

మడకశిర: వైఎస్ జగన్ జనంలోంచి వచ్చిన నాయకుడని, అందుకే ఆయన ఎక్కడికి వెళ్లినా జనం నీరాజనాలు పలుకుతున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు నవీన్‌నిశ్చల్ అన్నారు. శుక్రవారం ఆయన హిందూపురం ఎంపీ అభ్యర్థి శాంతమ్మ, మడకశిర అసెంబ్లీ అభ్యర్థి ఈరలక్కప్పతో కలిసి మీడియాతో మాట్లాడారు. 'మేమంతా సిద్ధం' పేరుతో సీఎం జగన్ నిర్వహిస్తున్న బస్సుయాత్రకు విశేష స్పందన లభిస్తోందన్నారు. ప్రొద్దుటూరు, నంద్యాల సభలకు లక్షలాదిమంది ప్రజలు హాజరు కావడమే ఇందుకు నిదర్శనమన్నారు. వైఎస్ జగన్‌కు లభిస్తున్న ప్రజాదరణచూసి ఓర్వలేక టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు కడుపుమంటతో తప్పుడు ప్రచారం చేస్తున్నారని, వారికి వంతపాడుతూ ఎల్లో మీడియా కూడా బస్సుయాత్రపై తప్పుడు ప్రచారం చేస్తూ రాక్షసానందం పొందుతోందని ధ్వజమెత్తారు. ఈ మూడు పార్టీల నాయకులకు పచ్చ కామెర్ల రోగమన్నారు. వెంటనే వీరిని ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందించాలని ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి చిత్తుగా ఓడటం ఖాయమన్నారు. వైఎస్ జగన్‌కే రాష్ట్ర ప్రజలు మళ్లీ పట్టం కడతారని తెలిపారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ ఎన్నికల పరిశీలకుడు ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నవీన్‌నిశ్చల్, చిత్రంలో శాంతమ్మ, ఈరలక్కప్ప



బ్రహ్మరథోత్సవానికి సిద్ధమవుతున్న తేరు

రారండోయ్.. తేరును చూద్దాం

- నేడు లక్ష్మీ నారసింహుడి బ్రహ్మ రథోత్సవం
- దేశంలో మూడవది, తెలుగు రాష్ట్రాల్లో పెద్ద రథం
- 3 లక్షలకుపైగా భక్తులు పాల్గొంటారని అంచనా

కదిరి: ఖాద్రీ లక్ష్మీ నారసింహుని బ్రహ్మోత్సవాల్లో అత్యంత ప్రాధాన్యత కలిగిన రథోత్సవానికి సర్వం సిద్ధమైంది. అశేష భక్త జన సందోహం మధ్య శనివారం ఉదయం 7.20 నుంచి 8.10 గంటల మధ్య అనురాధా నక్షత్రంలో మేష లగ్న పుష్కరాంశంలో తేరును ప్రారంభించేందుకు ఆలయ అర్చకులు శుభ సమయంగా నిర్ణయించారు. ఇప్పటికే ఆలయ ప్రాంగణంతో పాటు తిరు వీధుల్లోని భవనాలు సైతం భక్తులతో కిటకిటలాడుతున్నాయి. ఆలయ ప్రాంగణంలో కాలు మోపేందుకు చోటు లేదు. బ్రహ్మోత్సవాల్లో నారసింహుడు తిరు వీధుల్లో విహరించి భక్తులకు దర్శనభాగ్యం కలిగించడానికి దేవతలు తమ తమ వాహనాలను పంపుతారని భక్తుల నమ్మకం. సాక్షాత్తూ బ్రహ్మదేవుడే శ్రీవారి రథోత్సవం నాడు రథాన్ని నడిపి స్వామి వారు విహరించడానికి సహకరిస్తారని, అందుకే బ్రహ్మ రథోత్సవం అంటారని ఆలయ ప్రధాన అర్చకులు నరసింహాచార్యులు తెలిపారు.

దేశంలోనే మూడో పెద్ద తేరు

తమిళనాడు అండాళ్ అమ్మవారి శ్రీవల్లి పుత్తూరు రథం, తంజావూర్ జిల్లాలోని తిరువార్ రథం తర్వాత దేశంలో అతి పెద్ద రథం కదిరి తేరు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోకెల్లా అతిపెద్ద బ్రహ్మ రథం కూడా ఇదే. ఈ రథం సుమారు 540 టన్నుల బరువు, 37.5 అడుగుల ఎత్తు ఉంది. రథంలోని పీఠం వెడల్పు 16 అడుగులు ఉంటుంది. 120 ఏళ్ల క్రితం తయారు చేసిన రథ చక్రాలు ఒక అడుగు, అంగుళం వెడల్పుతో పాటు 8 అడుగుల డయామీటర్‌తో ఉన్నాయి. రథంపై సుమారు 256 శిల్ప కళాకృతులను టేకుతో అందంగా చెక్కారు. వివిధ భంగిమల్లో చెక్కిన ఈ బొమ్మలు అప్పటి శిల్పకళా నైపుణ్యానికి నిదర్శనంగా నిలిచాయి. 3 లక్షల మందికిపైగా భక్తులు రథోత్సవంలో పాల్గొంటారని పోలీస్ అధికారులు అంచనా వేస్తున్నారు. భక్తుల కోసం పట్టణంలో అడుగడుగునా అన్నదాన కార్యక్రమాల ఏర్పాటుకు దాతలు ముందుకొచ్చారు.

భారీ బందోబస్తు

ఖాద్రీశుడి బ్రహ్మరథోత్సవానికి భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు కదిరి డీఎస్పీ శ్రీలత తెలిపారు. ముగ్గురు డీఎస్పీలు, 10 మంది సీఐలు, 15 మంది ఎస్‌ఐలు, 210 మంది సివిల్, 90 మంది ఏఆర్ పోలీసులు, 100 మంది హోంగార్డులతో పాటు మరో 26 మందితో కూడిన ప్లటూన్ బలగాలను నియమించినట్లు ఆమె వెల్లడించారు. రథోత్సవం ప్రశాంతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని డీఎస్పీతో పాటు ఆలయ అధికారులు కోరారు.

క్లుప్తంగా

ట్రాక్టర్ కిందపడి యువకుడి మృతి

తలుపుల: ట్రాక్టర్ కిందపడి ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... తలుపుల మండలం మంగివాండ్లపల్లికి చెందిన భాస్కర్‌నాయుడు కుమారుడు మహేష్ నాయుడు (22) శుక్రవారం ఉదయం మల్లికార్జునకు చెందిన ట్రాక్టర్‌లో మడుగుతండా సమీపంలోని పొలాల్లో పనులకు బయలుదేరాడు. ఈ క్రమంలో ట్రాక్టర్ కుదుపులకు అదుపు తప్పి కిందపడడంతో ఇంజన్ చక్రాలతో పాటు ట్రాలీ చక్రాలు అతని మీదుగా దూసుకెళ్లాయి. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఉగాది పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం కల్చరల్: శ్రీక్రోధి నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఆల్ ది బెస్ట్ అకాడమీ నిర్వాహకులు 'ఉగాది జాతీయ పురస్కారాల'ను అందించనున్నారు. ఈ మేరకు నిర్వాహకులు ఈఎస్ఎస్ నారాయణ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. వివిధ రంగాల్లో విశేష కృషి చేస్తున్న వారు సరైన వివరాలతో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తులను 'ఆల్ ది బెస్టు అకాడమీ సామాజిక సేవా సంస్థ, డోర్ నం.1-20-164, తిరుమలగిరి పోస్టు, గోకుల్‌నగర్, వెంకటాపురం, సికింద్రాబాదు -15' ఏప్రిల్ 4వ తేదీలోపు పంపాలి. అర్హులైన వారికి ఏప్రిల్ 7న హైదరాబాద్‌లో అవార్డులను అందజేయనున్నారు. పూర్తి వివరాలకు 9652347207లో సంప్రదించవచ్చు.


కంబాల రాయుడే కదిరి నారసింహుడు



కంబాలరాయుని కొండపై ఉన్న సిద్దుల దొన



కొండపై ఉన్న శ్వేద తీర్థం



బ్రహ్మోత్సవాల ప్రత్యేకం

కదిరి: దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ కోసం మహా విష్ణువు వివిధ రూపాల్లో సాక్షాత్కరించారు. ఇందులో ఒకటి నారసింహుడు. ముల్లోకాలను ముప్పుతిప్పలు పెట్టిన హిరణ్య కశ్యపుడిని అంతమొందించేందుకు సగం మనిషి, సగం సింహ రూపంలో అవతరించిన నారసింహుడుని కంబాల రాయుడు అని కూడా భక్తులు పిలుస్తుంటారు. కంబం అంటే స్తంభం. స్తంభం నుంచి ఉగ్రరూపంతో భువిపైకి వచ్చిన నారసింహుడు.. హిరణ్య కశ్యపుడిని అంతమొందించిన తర్వాత గాండ్లపెంట మండలం గొడ్డువెలగల సమీపంలోని కొండపై అవతరించారని ఈ ప్రాంత ప్రజల నమ్మకం. ఇందుకు అక్కడి కొండపై స్వామి పాదాలు వెలిసినట్లు పురాణాలు సైతం చెబుతున్నాయి. ఇదే కొండపై శ్వేద తీర్థం, శిద్దుల దొన ఉన్నాయి. ఎన్ని కరువు కాటకాలొచ్చినా నీరు ఇంకిపోకుండా ఉండడం ఈ దొనల ప్రత్యేకత. ఈ ప్రాంతాన్ని ఒకప్పుడు పాలేగాళ్లు పాలించారు. వారి ఇలవేల్పు కూడా లక్ష్మీనరసింహస్వామి. అందుకే వీరి కుటుంబీకులు కదిరి ప్రాంతంలో ఎంతోమంది కంబన్న, కంబాలమ్మ అనే పేర్లు పెట్టుకున్నారు. ఏటా బ్రహ్మోత్సవాల సమయంలో పాలేగాళ్ల వారసులు గొడ్డువెలగల నుంచి నృసింహాలయానికి ఆనవాయితీగా ఇప్పటికీ జ్యోతిని తీసుకొస్తుంటారు.

భగ్గుమంటున్న భానుడు

- ఉమ్మడి జిల్లాలో పెరిగిన వేసవితాపం



పుట్టపర్తి టౌన్: భానుడు భగ్గుమనడంతో శుక్రవారం 'ఫ్రై'డేగా మారింది. దీంతో ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా పగటి ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పెరిగాయి. వేసవి సీజన్‌లో గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ధర్మవరంలో 41.6 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదు కాగా కొత్తచెరువు 41.3, పరిగి 41.1, బత్తలపల్లి, చెన్నేకొత్తపల్లి 40.9, ముదిగుబ్బ 40.8, తలుపుల 40.4, రామగిరి, కదిరి, ఎన్‌పీ కుంట 40.3, రొద్దం 40.1 డిగ్రీలు నమోదయ్యాయి. మిగతా మండలాల్లోనూ 40 నుంచి 38 డిగ్రీల మధ్య గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కనిష్ట ఉష్ణోగ్రతలు కూడా 26 నుంచి 20 డిగ్రీల మధ్య రికార్డయ్యాయి. సూర్యతాపానికి తోడు వడగాల్పులు జనానికి చెమటలు పట్టిస్తున్నాయి. దీంతో జనం బయటకు రావడానికి బెంబేలెత్తిపోతున్నారు. ఇక అనంతపురం జిల్లా గుంతకల్లులోనూ 42.4 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. శింగనమల, బొమ్మనహాళ్‌లో 42.1, తాడిపత్రి 41.8, విడపనకల్లు 41.6, కూడేరు 41.4, పుట్లూరు 41.3, యల్లనూరు 41.2, పెద్దవడుగూరు, ఆత్మకూరు 41.1 డిగ్రీలు నమోదయ్యాయి.

- వడదెబ్బ సోకకుండా జనం అప్రమత్తంగా ఉండాలని జిల్లా యంత్రాంగం హెచ్చరికలు జారీ చేస్తోంది. మంచినీరు, మజ్జిగ, పండ్ల రసాలు, ఓఆర్ఎస్ లాంటివి ఎక్కువ తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. గొడుగు, టోపీ లాంటివి పెట్టుకోవాలని, అత్యవసరం అయితే తప్ప మధ్యాహ్న సమయంలో బయటకు వెళ్లకపోవడం మేలని చెబుతున్నారు.

వడదెబ్బతో గొర్రెల కాపరి మృతి



మృతుడు నాగార్జున

ఉరవకొండ: వడదెబ్బతో ఓ గొర్రెల కాపరి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... ఉరవకొండ మండలం ఆమిద్యాల గ్రామానికి చెందిన పాల్తూరు నాగార్జున (38) గొర్రెల పోషణతో జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి గవిమఠం ఆవరణలో శివాలయం వద్ద నిద్ర చేయడానికి వచ్చిన ఆయన శనివారం ఉదయం అచేతనంగా పడి ఉండడంతో స్థానికులు గుర్తించి లేపేందుకు ప్రయత్నించారు. అయితే చలనం లేకపోవడంతో సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, మృతి చెందినట్లుగా నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్గం నిమిత్తం స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కాగా, వడదెబ్బ సోకి మృతి చెందినట్లుగా వైద్యులు నిర్ధారించారు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

మడకశిర రూరల్: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... మడకశిరకు చెందిన సోమశేఖర్ (52) మూర్ఛ వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా నయం కాలేదు. దీంతో మద్యానికి బానిసయ్యాడు. దీనికి తోడు ఆర్థిక ఇబ్బందులు తీవ్రం కావడంతో జీవితంపై విరక్తి పెంచుకున్న ఆయన ఎగువ అచ్చంపల్లి శివారులో శుక్రవారం సాయంత్రం లుంగీతో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ప్రచార ప్రకటనలపై ఎంసీఎంసీ నిఘా

- పెయిడ్ న్యూస్‌పై నిరంతర పర్యవేక్షణ
- ప్రకటనలకు కమిటీ ధ్రువీకరణ తప్పనిసరి
- దరఖాస్తు చేసుకున్న 48 గంటల్లోపు సర్టిఫికేషన్

అనంతపురం అర్బన్: ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ప్రచారం కోసం పత్రికల్లో ఇచ్చే ప్రకటనలపై మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) నిఘా పెడుతోంది. ఈ కమిటీ సభ్యులు రోజూ సమావేశమై ప్రసార మాధ్యమాల్లో వెలువడే ప్రకటనలను పరిశీలిస్తుంది. ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషియల్ మీడియాల్లో వెలువరించే ప్రతి పెయిడ్ న్యూస్‌ను పరిశీలిస్తుంది. అంతే కాక ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రకటనలకు సర్టిఫికేషన్ (ధ్రువీకరణ) జారీ చేసే ప్రక్రియనూ ఈ కమిటీ నిర్వర్తిస్తుంది. దరఖాస్తు చేసుకున్న 48 గంటల్లోపు ఆయా ప్రటకనలకు సర్టిఫికేషన్ ఇస్తుంది.

పెయిడ్ న్యూస్‌ను పట్టేస్తుంది

ఎన్నికల ప్రచారంలో భాగంగా అభ్యర్థులకు సంబంధించి వెలువరించే కథనాల్లో పెయిడ్ న్యూస్‌ను కలెక్టర్ చైర్మన్‌గా ఉన్న కమిటీ సభ్యులు పసిగట్టేస్తున్నారు. అభ్యర్థులు తమ ఎన్నికల ప్రచారానికి చేసే వ్యయాన్ని ఎన్నికల ఖర్చులో చూపాల్సి ఉంటుంది. అయితే కొందరు అభ్యర్థులు ఎన్నికల ఖర్చు తగ్గించి చూపేందుకు తమ అనుకూలంగా పత్రికల్లో, ఎలక్ట్రానిక్ మీడియాలో కథనాల రూపంలో ప్రచారం వచ్చేలే చూసుకుంటారు. వీటిని పెయిడ్ న్యూస్ (ఆర్టికల్స్) అంటారు. అభ్యర్థులు ప్రసార మాధ్యమాల్లో ఇచ్చే ప్రతి అంశాన్ని కమిటీ సభ్యులు క్షుణ్ణంగా పరిశీలించి, పెయిడ్ న్యూస్‌గా భావిస్తే దానిని కమిటీ చైర్మన్‌కు నివేదిస్తారు.

ఖరీఫ్ విత్తన ప్రణాళిక రెడీ

అనంతపురం అగ్రికల్చర్: జూన్ నుంచి ప్రారంభం కానున్న ఖరీఫ్-2024కు సంబంధించి రైతులకు రాయితీపై పంపిణీ చేసేందుకు విత్తన ప్రణాళిక సిద్ధం చేశారు. ఆర్‌బీకే వేదికగా క్షేత్రస్థాయిలో తయారు చేసిన విత్తన ప్రణాళికను ఇటీవల జిల్లా అధికారులు కమిషనరేట్‌కు సమర్పించారు. అక్కడి నుంచి అనుమతులు రాగానే ఏపీ సీడ్స్ ద్వారా ఎంపిక చేసిన ప్రాసెసింగ్ ప్లాంట్లు, ఇతర జిల్లాల నుంచి విత్తనాలు సేకరించి ఎక్కడికక్కడ ఆర్‌బీకేల్లో నిల్వ చేయనున్నారు. ఇదంతా ఏప్రిల్ నెలాఖరుకు సిద్ధం చేసి జూన్ మొదటి వారంలో రైతులకు పంపిణీ చేసేలా ప్రణాళిక రచించారు. విత్తన సేకరణ ధరలు, అమ్మకం ధర, రాయితీలు మే నెల మొదటి వారంలో ఖరారు చేయనున్నట్లు ఆ శాఖ వర్గాలు తెలిపాయి. ఎన్నికల కోడ్ ఉన్నా ఖరీఫ్‌లో రైతులు విత్తనం కోసం ఇబ్బంది పడకుండా ఉన్నతస్థాయి అనుమతులతో పంపిణీ చేయనున్నారు.

వేరుశనగకే ప్రాధాన్యత : ఏటా మాదిరిగానే ఈసారి కూడా రాయితీ విత్తన ప్రణాళికలో వేరుశనగకే ప్రాధాన్యత ఇచ్చారు. జిల్లాకు 1.25 లక్షల క్వింటాళ్ల విత్తన వేరుశనగ అవసరమని ప్రతిపాదించారు. అయితే పదేళ్లుగా పెద్ద ఎత్తున పంపిణీ చేస్తున్న కే-6 రకాన్ని తగ్గించి వాటి స్థానంలో కే-9, కదిరి-లేపాక్షి-1812, అలాగే టీసీజీఎస్-1694 (వశిష్ట) లాంటి మరికొన్ని వేరుశనగ రకాలను అందుబాటులోకి తేవాలని గురువారం జరిగిన సమన్వయ సమావేశంలో అటు అధికారులు, ఇటు శాస్త్రవేత్తలు చర్చించారు. అలాగే 2,500 క్వింటాళ్ల కందులు, జనుము, జీలుగ, పిల్లిపెసర లాంటి పచ్చిరొట్ట విత్తనాలు 600 క్వింటాళ్లు కేటాయించారు. అలసందలు 150 క్వింటాళ్లు, పెసలు 100 క్వింటాళ్లు, విత్తన కొర్ర 100 క్వింటాళ్లు, మరో 50 క్వింటాళ్ల రాగుల పంపిణీకి ప్రణాళిక తయారు చేశారు. కందుల్లో కూడా కేవలం ఎల్‌ఆర్‌జీ-41 రకం కాకుండా పీఆర్‌జీ-176 రకాన్ని ప్రోత్సహించాలని, అలాగే సూర్యనంది, గరుడ రకాల కొర్రలను అందుబాటులో ఉంచాలనే దానిపై చర్చించారు. ఇవి కాకుండా నాన్‌సబ్సిడీ కింద వరి, ఆముదం, మొక్కజొన్న, చిరుధాన్యాలు లాంటి మరికొన్ని రైతులకు అవసరమైన విత్తనాలు ఇవ్వడానికి కూడా ప్లాన్ చేస్తున్నట్లు ఆ శాఖ అధికారులు తెలిపారు.

బాలుడి కిడ్నాప్‌నకు యత్నం

కంబదూరు: మండల కేంద్రానికి చెందిన ఓ బాలుడి కిడ్నాప్ యత్నం స్థానికంగా కలకలం రేపింది. వివరాలు స్థానిక వైఎస్సార్ సర్కిల్‌లో నివాసం ఉంటున్న ఆర్టీసీ కండెక్టర్ గంగాధర్ కుమారుడు గౌతమ్ కౌశిక్ గురువారం రాత్రి తాతతో కలసి ఇంటి బయట మంచంపై నిద్రిస్తుండగా అర్ధరాత్రి ఓ కారులో వచ్చిన దుండగులు అపహరించుకెళ్లేందుకు ప్రయత్నించారు. మంచం మీద పడుకున్న బాలుడిని ఎత్తుకుంటుండగా పక్కనే ఉన్న తాత మేల్కొని కేకలు వేయడంతో దుండగులు పరారయ్యారు. విషయాన్ని వెంటనే డయల్ 100కు చేరవేయడంతో పోలీసులు అక్కడకు చేరుకుని గాలించారు. దుండగుల ఆచూకీ లభ్యం కాలేదు. ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

పిచ్చికుక్క దాడిలో 15 మందికి గాయాలు

వజ్రకరూరు: మండలంలోని గూళ్యపాళ్యంలో శుక్రవారం రాత్రి పిచ్చి కుక్క వీరంగం చేసింది. వీధుల్లో సంచరిస్తూ కనిపించిన వారిని వెంటాడి కరిచింది. గాయపడిన వారిలో లాలుస్వామి, గుర్రప్ప, కేశప్ప, సరోజమ్మతో పాటు మరో 11మంది ఉన్నారు. గాయపడిన వారు గుంతకల్లులోని ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నారు. తీవ్రంగా గాయపడిన ఒకరిని అనంతపురానికి రెఫర్ చేశారు. మనుషులతో పాటు ఓ ఎద్దు, ఆవుపై కూడా పిచ్చి కుక్క దాడి చేసింది.

సీమ సాంస్కృతిక రంగంలో కొత్తమలుపు

అనంతపురం కల్చరల్: రాయలసీమ ప్రాంత జీవన స్థితిగతులు సంస్కృతిని కేవలం సాహిత్యంలోనే కాకుండా రంగురంగుల చిత్రాలలో వాస్తవ పరిస్థితులకు అద్దం పట్టేలా చిత్రీకరించడం సీమ సాంస్కృతిక రంగంలో మరో కొత్త మలుపు అని సీనియర్ రచయిత, మానవతా కన్వీనర్ తరిమెల అమరనాథరెడ్డి అన్నారు. వేమన ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆ సంస్థ కార్యాలయంలో రాయలసీమ చిత్రలేఖ ప్రదర్శన జరిగింది. తిమ్మాపురం బాలకృష్ణారెడ్డి స్మారకార్థం జరిగిన కార్యక్రమానికి వేమన ఫౌండేషన్ అధ్యక్షుడు మాజీ వీసీ ఆచార్య కాడా రామకృష్ణారెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా తరిమెల అమరనాథరెడ్డి, కార్యక్రమ కన్వీనర్ డాక్టర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి, షేక్ నబీ రసూల్ తదితరులు మాట్లాడారు. విభిన్న సంప్రదాయాలు, భిన్నత్వంలో ఏకత్వంతో సీమ సమాజం ఆదర్శంగా నిలించిందన్నారు. అనంతరం చిత్రప్రదర్శనను అనేక మంది తిలకించారు. కార్యక్రమంలో కవులు గోసల నారాయణ స్వామి, షేక్ రియాజుద్దీన్ అహ్మద్, మధురశ్రీ, కృష్ణవేణి, టీవీరెడ్డి, ఈరన్న పాల్గొన్నారు.

టిప్పర్ ఢీ - యువకుడి మృతి



మృతుడు విష్ణువర్దన్

పుట్టపర్తి అర్బన్: టిప్పర్ ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... బుక్కపట్నం మండలం నార్సింపల్లికి చెందిన విష్ణువర్దన్ (27)కు భార్య చంద్రకళ, ఇద్దరు కుమారులు ఉన్నారు. బేల్దారి పనులతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో గురవారం గోరంట్లలో భవన నిర్మాణ పనుల్లో పాల్గొన్న విష్ణువర్దన్ సాయంత్రానికి బస్సులో పుట్టపర్తికి చేరుకున్నాడు. అనంతరం రాత్రి 12 గంటలకు అక్కడి నుంచి తన ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి బయలుదేరాడు. పుట్టపర్తి మండలం కర్ణాటక నాగేపల్లి వద్దకు చేరుకోగానే జాతీయ రహదారి పనుల కోసం కంకర తరలిస్తున్న టిప్పర్ వేగంగా దూసుకొచ్చి ఢీకొంది. ఘటనలో విష్ణువర్దన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనాన్ని నిలపకుండా ముందుకు దూసుకెళ్లాడు. అటుగా మరో వాహనంపై వెళుతున్న వ్యక్తి వెంటనే క్షతగాత్రుడిని పుట్టపర్తిలోని సత్యసాయి ఆస్పత్రికి తీసుకెళ్లాడు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై పుట్టపర్తి రూరల్ ఎస్ఐ కృష్ణమూర్తి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, టిప్పర్ వాహనాన్ని స్వాధీనం చేసుకుని, ప్రమాదానికి కారణమైన జార్ఖండ్‌కు చెందిన డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

ఓటు.. మన హక్కు



- నమోదుకు ఏప్రిల్ 15 వరకూ అవకాశం

హిందూపురం అర్బన్: రాష్ట్రంలో మే 13న సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి. 18 ఏళ్లు నిండి ఇప్పటికీ ఓటరుగా నమోదు చేసుకోని వారికి, జాబితాలో పేరు గల్లంతైన వారికి ఎన్నికల సంఘం మరో అవకాశం ఇచ్చింది. ఏప్రిల్ 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండి ఉంటే చాలు ఎవరైనా ఓటరుగా నమోదు చేసుకోవచ్చు.

ఆన్‌లైన్‌లో ఎన్‌రోల్ ఇలా...

www. nvsp. in వెబ్‌సైట్‌లో మీ ఫోన్ నంబర్‌తో రిజిస్టర్ చేసుకుని లాగిన్ కావాలి. వివరాలన్నీ నమోదు చేసి సబిట్ చేయాలి. ఆన్‌లైన్ దరఖాస్తు ఆధారంగా బూత్‌లెవెల్ అధికారి క్షేత్రస్థాయికి వచ్చి వివరాలు పరిశీలిస్తారు. తర్వాత ఓటరుగా మీ పేరు జాబితాలో చేరుస్తారు.

ఆఫ్‌లైన్‌లో ఇలా..

18 ఏళ్లు నిండిన వారు నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందుకు బూత్‌లెవెల్ అధికారికి ఫారం-6 ఇవ్వాల్సి ఉంటుంది. లేదా సంబంధిత తహసీల్దార్ కార్యాలయంలో అందజేయవచ్చు. క్షేత్ర స్థాయిలో పరిశీలించిన తర్వాత మీ పేరును ఓటరు జాబితాలో చేరుస్తారు. ఓటు హక్కు నమోదుపై సందేహలుంటే 1950 టోల్ ఫ్రీ నంబర్ లేదా కలెక్టరేట్ ఏర్పాటు చేసిన కంట్రోల్‌రూంలోని 18004258795, 796,797 టోల్‌ఫ్రీ నంబర్లలో సంప్రదించవచ్చు.

బీటెక్ విద్యార్థి బలవన్మరణం



సురేంద్ర మృతదేహాన్ని పరిశీలిస్తున్న కానిస్టేబుల్

అనంతపురం సిటీ: ఒత్తిళ్లను తాళలేక బీటెక్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు... శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువు మండలం కదిరేపల్లికి చెందిన తంగెం కొండప్ప కుమారుడు సురేంద్ర (22)... శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ నాల్గో సంవత్సరం (ఈసీఈ) చదువుతున్నాడు. ఈ క్రమంలో ఎంఎస్‌ను విదేశాల్లో పూర్తి చేయాలని భావించాడు. ఈ క్రమంలో నిర్వహించిన పరీక్షల్లో ఆశించిన ర్యాంక్ రాకపోవడంతో తీవ్ర ఒత్తిడికి లోనయ్యాడు. కన్నవారికి తన మొహం చూపించలేక ఏమో శుక్రవారం మధ్యాహ్నం జంగాలపల్లి - ప్రసన్నాయపల్లి మార్గంలో పట్టాలపైకి చేరుకుకుని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. శరీరం నుంచి తల వేరైంది. సమాచారం అందుకున్న జీఆర్పీ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

- డీఐజీ అమ్మిరెడ్డి, ఎస్పీ మాధవరెడ్డి
- కదిరిలో సాయుధ బలగాలతో పోలీసు కవాతు



కదిరిలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

కదిరి టౌన్: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు అందరూ సహకరించాలని అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి, ఎస్పీ మాధవరెడ్డి కోరారు. ప్రజలు స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకునేలా జిల్లా పోలీసు యంత్రాంగం చూస్తుందన్నారు. శుక్రవారం వారు పట్టణంలో సాయిధ బలగాలతో కలిసి కవాతు నిర్వహించారు. వేమారెడ్డి సర్కిల్ నుంచి ప్రారంభమైన పోలీసుల కవాతు టవర్‌క్లాక్ మీదుగా మున్సిపల్ కార్యాలయం మీదుగా పట్టణ పోలీస్ స్టేషన్ వరకూ సాగింది. కార్యక్రమంలో జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి నాగభూషణం, డీఎస్పీ శ్రీలత, సైబర్ క్రైం సీఐ హేమంత్‌కుమార్, సీఐలు పుల్లయ్య, వెంకటేశ్వర్లు, మోహన్, పలువురు ఎస్ఐలు పాల్గొన్నారు.

టీడీపీ ఎన్నికల ప్రచారంలో యానిమేటర్



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న యానిమేటర్ రమేష్ (వృత్తంలోని వ్యక్తి)

పరిగి: ఎన్నికల నిబంధనలు తుంగలో తొక్కి పరిగి మండలం హొన్నంపల్లి పంచాయతీ జంగాలపల్లి యానియేటర్ రమేష్... ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నాడు. పెనుకొండ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి సవితమ్మ తరఫున ఈ నెల 27న జంగాలపల్లిలో నిర్వహించిన ప్రచారంలో ఆయన పాల్గొన్నాడు. ఈ అంశం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నా... అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

వింత గొర్రె పిల్ల జననం



పుట్టపర్తి అర్బన్: మండలంలోని సుబ్బరాయనిపల్లిలో వింత గొర్రెపిల్ల జన్మించింది. గొర్రెల కాపరి మారుతికి చెందిన మందలోని ఓ గొర్రె శుక్రవారం తెల్లవారుజామున 8 కాళ్లు, రెండు తలలతో కూడిన పిల్లకు జన్మనిచ్చింది. జన్మించిన కొద్ది సేపటికే ఆ పిల్ల మృతి చెందింది. ఈ వింత గొర్రె పిల్లను చూసేందుకు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో అక్కడకు గుమికూడారు. మృతి చెందిన పిల్లను చిత్రావతిలో ఖననం చేశారు.

మానవాళి కోసమే క్రీస్తు శిలువ త్యాగం





ప్రశాంతి గ్రామం వద్ద షాలోమ్ మిషన్ చర్చిలో ప్రార్థనలు నిర్వహిస్తున్న క్రైస్తవులు, కింగ్స్‌చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

- జిల్లావ్యాప్తంగా చర్చిల్లో గుడ్ ఫ్రైడే ప్రార్థనలు

పుట్టపర్తి టౌన్: మానవాళి కోసమే యేసుక్రీస్తు శిలువపై తన రక్తం చిందించి ప్రాణ త్యాగం చేశారని క్రైస్తవ మత బోధకులు వివరించారు. క్రీస్తు శిలువనెక్కిన శుభ శుక్రవారాన్ని పురస్కరించుకుని జిల్లాలోని అన్ని చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ఈ సందర్భంగా యేసు శిలువపై పలికిన ఏడు మాటలను ధ్యానించారు. చర్చిల ఆవరణల్లో శిలువ ఘట్టాలను ప్రదర్శించారు. పుట్టపర్తి పట్టణంలో కర్ణాటకనాగేపల్లి గ్రామంలో, హోలీసిటీ చర్చి, కింగ్స్ చర్చిలో పాస్టర్ అరుణ్‌కుమార్, బీడుపల్లి, ప్రశాంతి గ్రామంలోని షాలోమ్ మిషన్ చర్చిలో పాస్టర్ రాజారత్నం ఆధ్వర్యంలో ఉదయం క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అలాగే కదిరి, హిందూపురం, మడకశిర, పెనుకొండ తదితర ప్రాంతాల్లోని చర్చిలలోనూ శుభ శుక్రవార ప్రార్థనలు జరిగాయి.